క్లుప్తంగా

అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం:మండలంలోని చీకూరుపల్లెలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వాణిశ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చీకూరుపల్లెలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టు ఖాళీగా ఉందని, గ్రామంలో అర్హులైన ఓసీ అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 22వ తేది సాయంత్రం లోపు తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మాతా–శిశు మరణాల నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రసూతి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని కోరారు. గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్ల రసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొత్త కంప్యూటర్లు ఏర్పాటు చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన కంప్యూటర్లు, ప్రింటర్ల స్థానంలో కొత్త కంప్యూటర్లును రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. తొండమూలాన షార్ట్‌సర్క్యూట్ సంభవించి ప్రభుత్వ కార్యాలయాల్లో రూ.15లక్షల ఆస్తినష్టం సంభవించడం విదితమే. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎంపీడీఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో గుర్తింపు నంబర్


రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ

గుడిపాల: ఆధార్ తరహాలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. గుడిపాల రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఆమె రైతులకు అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ రిజిస్ట్రేషన్ నంబర్ రిజిస్ట్రేషన్ చేసి మాట్లాడారు. మండలంలోని రైతుల వివరాలను నమోదు చేసి రైతులకు డిజిటల్ ఫార్మర్ ఐడీ ఇస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో రైతుల గుర్తింపు కోసం ఈ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. 14 అంకెల ఈ గుర్తింపు నంబర్‌తో వ్యవసాయ, అనుబంధ శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందడానికి వీలవుతుందన్నారు. అలాగే వాతావరణ మార్పులు, వ్యవసాయ పథకాల ఫలాలు నేరుగా రైతులకు చేరవేయడానికి, పంటనష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారం, మంజూరు..ఇత్యాది వాటికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నమోదు చేసుకోవడానికి ఆధార్‌కార్డ్, 1బి, ఆధార్‌లింక్‌తో ఉన్న సెల్ నంబర్ తీసుకురావాలన్నారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో రైతు ఫార్మసీ రిజిష్టర్‌ను ప్రారంభించారు.

గజవాహనంపై వేణు గోపాలుడి చిద్విలాసం



వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజైన మంగళవారం స్వామి వారు గజవాహనంపై పట్టణ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులను అలంకరించి పట్టణంలో ఊరేగించారు. రాత్రి స్వామి వారిని గజవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారికి హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన రథోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

సైబర్..డర్



ప్రస్తుతం టెక్నాలజీ కత్తికి రెండు వైపులా పదులా మారింది. సద్వినియోగం చేసుకునేవారు కొందరైతే, దుర్వినియోగం చేసేవారే ఎక్కువగా ఉంటున్నాయని ప్రస్తుతం పెచ్చరిల్లితున్న సైబర్ నేరాలు చెప్పకనే చెబుతున్నాయి. ఈ నేరాలపై ఎప్పటికప్పుడు పోలీసులు అప్రమత్తం చేస్తున్నా, అవగాహన కల్పిస్తున్నా సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చి, ప్రజలను బురిడీ కొట్టించి, కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నారు. చిత్తూరులో గత ఏడాది కొందరు సైబర్ కేటుగాళ్ల బారిన పడి మోసపోయారు. ఈ ఏడాది కూడా సైబర్ నేరగాళ్లు కొందరిపై వల విసిరారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు వీటిపై అవగాహన కల్పించేందుకు మరోసారి శ్రీకారం చుట్టారు.

- మోసాల బారినపడొద్దు
- ఏమారితే అంతే సంగతులు
- అధికమవుతున్న సైబర్ మోసాలు
- అవగాహన కల్పించే దిశగా జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : టెక్నాలజీలో చోటుచేసుకుంటున్న మార్పులను సైతం సైబర్ నేరగాళ్లు ఆకళింపు చేసుకుని నేరాల్లో సరికొత్త ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. వ్యక్తిగత డేటా దొంగలించడం, మోసపూరిత ఫోన్‌కాల్స్, సోషల్ మీడియాలో మోసాలు, బ్యాంకింగ్ డేటా దొంగిలించడం, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, ఫేక్ సైట్లు, సోషల్ మీడియాలో భయపెట్టే సందేశాలు, ఫేక్ లోన్ యాప్స్ మోసాలు.. ఇలా వీటి వలలో పడి చాలా మంది లేక ఇప్పటికీ నష్టపోతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమ నిర్వహణకు పూనుకుంటున్నారు.

జాగ్రత్తలు ముఖ్యం

- మహిళలు,బాలికలు ఆన్‌లైన్ స్నేహాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.
- సైబర్ నేరస్తులు స్నేహం చేసేందుకు తరచూ నకిలీ ప్రొఫైల్స్ సృష్టిస్తుంటారనేది గ్రహించాలి. ఫేస్‌బుక్ స్నేహితులను నమ్మకూడదు.
- అపరిచితుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకపోవడం మంచిది.
- వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ వెల్లడించరాదు.
- ఒకే ఒక్క క్లిక్‌తో వివరాలను, నగదును సైబర్ నేరగాళ్లు కాజేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అనుమానస్పద లింక్స్ జోలికి వెళ్లకపోవడమే శ్రేయస్కరం.
- పాస్‌వర్డ్‌లు ఇతరులకు తెలియజేయకుండా జాగ్రత్తగా పెట్టుకోవాలి.
- పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో విదేశీ నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ సందేశాలను నమ్మకూడదు.
- లోన్‌యాప్స్‌లో అప్పు తీసుకుంటే జీవితం నాశనం అవుతున్న విషయాన్ని తెలుసుకోవాలి.
- స్మార్ట్‌ఫోన్లలో ఉన్న ప్లే స్టోర్స్‌లో ఫేక్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు.
- లోన్ యాప్‌లకు మీ ఫోన్‌లోని కెమెరా, కాంటాక్ట్, మీడియా, గ్యాలరీ, లొకేషన్ పర్మిషన్, ఆధార్, ఓటీపీలను ఇవ్వకూడదు.



సైబర్ మోసాలపై అవగాహన ముఖ్యం



సైబర్ మోసాలపై అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది మోసపోతున్నారు. క్షేత్రస్థాయిలో సైబర్ మోసాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా ఉంది. ఇంటర్నెట్‌ను చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్ చిత్తూరు.

మోసాలిలా...



- అవగాహన లేకుండా పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పడం, వాట్సాప్‌లలో వచ్చే లింకులను నొక్కడం, వ్యక్తిగత వివరాలు తెలియని వ్యక్తులతో పంచుకోవడం వల్ల మోసాలకు పాల్పడుతున్నారు.
- ఇతర క్రైమ్‌లతో పోలిస్తే సైబర్ క్రైమ్ నేరాలు ప్రతి ఏటా 12 శాతం పెరుగుతున్నాయని క్రైం రికార్డులు చెబుతున్నాయి.
- తక్కువ డబ్బు ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ మొత్తం వస్తుందనే ఆశచూపించడం, డబ్బులు కడితే ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి పలు దఫాలుగా ఎక్కువ నగదు తీసుకోవడం, పార్ట్ టైం ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్సప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు పంపించడం.. ఇలా చాలా రకాలుగా సైబర్ మోసాలు చేస్తున్నారు.
- అలానే బ్యాంకు లావాదేవీలపై ఓటీపీ నేరాలు, క్యూ ఆర్ స్కాన్ ఉపయోగించి లావాదేవీలు చేసి మోసం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 9440900005, సైబర్ మిత్ర 9121211100 నంబర్, టోల్ ఫ్రీ నంబర్ 1930 లకు ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటే మోసాల బారిన పడకుండా తప్పించుకోవచ్చు. అనుమానితులకు వ్యక్తిగత వివరాలు తెలియకండి.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు.

పూత దశలో సస్యరక్షణ చర్యలే కీలకం


మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి సాగరిక

ఐరాల: పూతదశలో మామిడిచెట్లకు సస్యరక్షణ చర్యలు చాలా కీలకమని మండల ఉద్యానవన శాఖ అధికారి సాగరిక అన్నారు. మంగళవారం మండలంలోని వైఎస్.గేటు రైతు సేవా కేంద్రంలో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగరిక మాట్లాడుతూ, మామిడి తోటల్లో పూతదశలో ప్రధానంగా బూడిద తెగులు కనిపిస్తోందని, దీని నివారణకు కంపానియన్ మందు 1.5 మి.లీకు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనెమంచు పురుగు నివారణకు బుప్రోఫెజిన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందె ఫిబ్రవరి రెండు లేదా మూడో వారం నుంచి కట్టే అవకాశం ఉందని, ఈ సమయంలో ఆర్కా మాంగో స్పెషల్ 5 గ్రాములు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. గొంగళి పురుగుల నివారణకు ప్రోక్లైమ్ మందును 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, నల్లతామర నివారణకు జిగురు అట్టలు వాడాలని సూచించారు. ఏఓ మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు , రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'


సరకల్లులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్


గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

తవణంపల్లె: ప్రజారోగ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లులో మోహన్‌వేలు ఫ్యామిలీ డాక్టర్, మైనగుండ్లపల్లెలో వైద్యాధికారి డాక్టర్ కేశవ నారాయణ, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య శిబిరంనిర్వహించారు. గర్భవతులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా పండ్లు, తాజా కూరలు, గుడ్లు ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పాలకల, మల్లార్‌పల్లెలో..

ఐరాల: మండలంలోని పాలకల, మల్లార్‌పల్లె గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాపసముద్రంలో..

గుడిపాల: మండలంలోని పాపసముద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ సంధ్య ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. పలువురినీ పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించారు. వైద్య సిబ్బంది రుక్మిణమ్మ, గిరిజ, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి గడ్డి మోపులు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పుత్తూరు: ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న గడ్డి మోపులు అగ్నికి ఆహుతైన సంఘటన మంగళవారం పుత్తూరు పట్టణ పరిధిలోని చౌటూరు గ్రామ సమీపంలో చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు... తిరుపతి జిల్లా నాగలాపురానికి చెందిన శేఖర్ మొదలియార్ ట్రాక్టర్‌పై 70 గడ్డి మోపుల కట్టలను వేసుకొని ఊరూరా తిరుగుతూ అమ్మకానికి పుత్తూరు వచ్చాడు. అక్కడి నుంచి చౌటూరు గ్రామానికి వెళుతున్న సమయంలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ట్రాక్టర్‌ను వెనక్కు తిప్పే సమయంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గడ్డి మోపు తగలడంతో రాపిడికి నిప్పు రవ్వలు రేగి అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. అయితే గడ్డి మోపులు పూర్తిగా కాలిపోగా, ట్రాక్టర్‌ను బయటకు తీసి ప్రమాద స్థాయిని తగ్గించగలిగారు.

నిధులను ఎందుకు ఖర్చు చేయలేదు?


ఎంపీడీఓతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: "పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులుగా మీపై ఉంటుంది.. మండలంలో తాగునీటి సమస్య కోసం ఇచ్చిన నిధులను ఎందుకు ఖర్చు చేయలేదు?" అని జెడ్పీ చైర్మన్ వాసు ఎంపీడీఓ ఖాదర్‌బాషాను ప్రశ్నించారు. తాగునీటి సమస్యపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జెడ్పీ చైర్మన్ సమీక్షించారు. గతంలో మండలంలో అభివృద్ధి పనుల కోసం జెడ్పీ నిధులు రూ.50లక్షలు ఇచ్చినా ఆ పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. అందుకు స్థానిక రాజకీయ కారణాలున్నాయని అంటున్నారని చెబుతున్నారని తెలిసిందన్నారు. మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికైనా ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఎంతమాత్రమూ సరికాదని మండిపడ్డారు. మొరంలో రెండు, కొలమాసనపల్లె, సముద్రపల్లెలో బోరు మోటార్ల కోసం జెడ్పీ నుంచి మంజూరు చేసిన నిధులను ఎందుకు ఖర్చు పెట్టడం లేదని ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ బదులు ఇవ్వకపోవడం గమనార్హం! ఇప్పటికైనా మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని గట్టిగా హెచ్చరించారు. ఎంపీపీ రోజా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నేతలు చెంగారెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తైపూస మహోత్సవం


ఊరేగింపుగా వస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని శ్రీసుబ్రమణ్యస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో తైపూస మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీబీ రోడ్డు నుంచి భక్తులు స్వామి చిత్రపటం, పాలబిందెలతో ఊరేగింపుగా వచ్చారు. అనంతరం మూలవిరాట్‌కు పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. హరోహర నామస్మరణలతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్, దాత పార్థసారథి నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయమని ఇందిరక్రాంతి ఏపీఎం సుధారాణి అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గ్రామ సంఘాలు అభివృద్ధి చెందితేనే మండల సమాఖ్యలు అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలకు స్త్రీనిధి రుణాలను విరివిగా మంజూరు చేయిస్తామని, బ్యాంకులు, గ్రామసంఘాల రుణాలను సకాలంలో కట్టించేలా సంఘమిత్రలు చూడాలన్నారు. ప్రతి సంఘంలోని సభ్యురాళ్లు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, మల్లీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎంయూ ట్రైన్‌ను పుత్తూరు వరకు పొడిగించరూ!


సమావేశంలో స్టేషన్ మాస్టర్‌కు సమస్యలను నివేదిస్తున్న కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

నగరి: ఈఎంయూ (ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) ట్రైన్‌ను పుత్తూరు వరకు పొడిగించాలని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ ఆవరణలో స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్‌సీసీ సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈఎంయూ ట్రైన్లను పుత్తూరు వరకు పొడిగించాలని, ట్రైన్ నంబర్లు 12164, 12163, 22160, 22159 లను ఏకాంబరకుప్పం వద్ద ఆపాలని, ఎల్‌సీ 49 వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని, చెన్నై–తిరుపతి మార్గంలో ప్రయాణించే ట్రైన్ నంబరు 66021, 66022లను పునరుద్ధరించాలని, ఏకాంబరకుప్పం దళితవాడ రోడ్డులో ఇండియన్ బ్యాంకు సమీపంలో సబ్‌వే నిర్మించాలని సమావేశంలో సభ్యులు కోరారు. ఈ మేరకు స్టేషన్ అధికారి సదరన్ రైల్వే అధికారులకు లేఖ రూపంలో తెలియపరుస్తానన్నారు. కార్యక్రమంలో సభ్యులు వినయ్‌కుమార్, అఖిల్‌బాషా, సురేష్, శేఖర్, శ్రీనివాసన్, పొన్నప్పన్, బాలక్రిష్ణ, రాజమహేశ్వరన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

పుంగనూరు: ఎండలు పెరుగుతున్న తరుణంలో ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అన్నారు. మంగళవారం మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బరాజు మాట్లాడుతూ, ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం వివిధ అగ్నిప్రమాదాలు, వాటిని ఆర్పడానికి వినియోగించే వస్తువులతో ప్రదర్శన పూర్వకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకరపై తారు రోడ్డు వేశారు


మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె రోడ్డు దగ్గర వేసిన తారురోడ్డు

సాక్షి ఎఫెక్ట్..



తవణంపల్లె: మండలంలోని చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారి పనులకు మోక్షం లభించింది. ఉత్తరబ్రాహ్మణపల్లె రోడ్డు దగ్గర ప్రధాన రహదారిపై కంకర వేసి తారు వేయకుండా పనులు నిలిచి పోవడంతో వాహనచోదకులు, ప్రజలకు ఇబ్బందుల నడుమ ప్రయాణం సాగించాల్సి వచ్చేది. దీనిపై 10వ తేదీ సాక్షి దినపత్రికలో 'కంకర..ప్రయాణం హరహరా..!' శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు కంకరపై తారురోడ్డు వేయడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. దీనిపై వాహనచోదకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎనీటైం మనీ.. భద్రతలేదేమి..!



గుడిపాలలో మూతబడిన ఎస్‌బిఐ ఏటీఎం



సెక్యూరిటీ గార్డు లేని ఇండియావన్ ఏటీఎం

గుడిపాల: పలు బ్యాంకుల ఏటీఎంల వద్ద భద్రత కొరవడింది. మండలంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రెండు మెషిన్లు ఉన్నాయి. ఇక్కడ సెక్యూరిటీ లేకపోవడంతో గత ఏడాది ఆగస్టులో మెషిన్ ధ్వంసం చేసి సుమారు రూ.26లక్షల వరకు దుండగులు చోరీ చేశారు. అప్పటినుంచి ఏటీఎం మూతపడింది. ఇంతవరకు దీనిని తెరవలేదు. దీనిని దృష్టిలో ఉంచుకునైనా ఇతర ఏటీఎంల భద్రతకు చర్యలు తీసుకున్నారా? అంటే అదీ లేదు. గుడిపాలలో ఉన్న టాటా ఇండికామ్, బొమ్మసముద్రం, 197రామాపురంలో ఉన్న ఏటీఎంల వద్ద సెక్యూరిటీ అనే ఊసే లేదు. ఏటీఎంలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా, అవి బయటి వైపు నుంచి వచ్చే వారు కనబడేలా లేకపోవడంతో చోరీలకు తావిస్తోందనే విమర్శలొస్తున్నాయి.

గర్భిణులకు విధిగా హెచ్‌బీ పరీక్షలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): గర్భిణులకు విధిగా హెచ్‌బీ పరీక్షలు చేయాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కౌమారదశ బాలికలకు ఎలాంటి తప్పులు లేకుండా హెచ్‌బీ చేయాలన్నారు. రక్తహీనత లోప నివారణకు వైద్య బృందం సమష్టిగా పని చేయాలన్నారు. వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ అధికారి దేవేంద్ర పాల్గొన్నారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె:ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి ఉభయదారులతో అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజల అనంతరం 11.30 గంటలకు సుదర్శన హోమం, రాత్రి 7.30 గంటలకు ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.